# కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## నల్లగొండ కలెక్టర్ కర్ణన్



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

నీలగిరి, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై అబ్జర్వర్లు ప్రతిపాల్‌హాన్, ఆర్. మనుల్‌రాజ్, జైనేంద్ర సింగ్‌లతో కలిసి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని గోదాముల్లో జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభ మవుతుందన్నారు. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 కౌంటింగ్ టేబుళ్లు, ఒక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రిజర్వ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఏదైన సమస్య తలెత్తితే రిటర్నింగ్ అధికారికి తెలుపాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు కౌంటింగ్ ప్రక్రియను గమనించాలని, సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ప్రతి రౌండ్ వారి వివరాలు ఆర్వోకు అందేలా చూడాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి సంతకాలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గానికి 132 మంది చొప్పున కౌంటింగ్ సూపర్ వైజర్లు, 132 కౌంటింగ్ అసిస్టెంట్లు, 132 మైక్రో అబ్జర్వర్లను కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, నోడల్ ఆఫీసర్లు వెంకయ్య, రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

### ఏర్పాట్ల పరిశీలన

తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలో ఓట్ల లెక్కింపుకోసం జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, కౌంటింగ్ అబ్జర్వర్లు, జిల్లా ఎస్పీ అపూర్వరావుతో కలిసి పరిశీలించారు. కేంద్రం వద్ద మీడియా సెంటర్ ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తామని వివరించారు. పోలీసుల ద్వారా బారికేడ్లు ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు చేపడుతున్నట్లు వివరించారు.

### కౌంటింగ్ ప్రక్రియ ఇలా ..

- ఒక్కో నియోజకవర్గానికి ఒక కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు.
- ఒక్కో కేంద్రంలో 14 కౌంటింగ్ టేబుళ్లు, రిటర్నింగ్ అధికారి కోసం ఒక అదనపు టేబుల్ ఉంటుంది.
- కౌంటింగ్‌కు ముందు ప్రిసైడింగ్ అధికారి సంతకంతో ఉన్న 17 సీ ఫారం వివరాలు ఏజెంట్లకు అందిస్తారు.
- ఉదయం 8 గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపడతారు.
- వెంటనే ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపు మొదలు పెడతారు.
- 17 సీ ఫారంలో ఈవీఎంల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఉంటాయి.(పోలింగ్ పూర్తయిన తర్వాత నమోదు చేస్తారు)
- ఆ పోలైన ఓట్ల మొత్తం, ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్ల సంఖ్యకు సమానంగా ఉన్నాయో లేదో సరి చూస్తారు.
- ఆయా సంఖ్యలు నోట్ చేసుకోవడంతోపాటు ఏజెంట్లకు చూపించి వారి సంతకాలు తీసుకుంటారు.
- వాటిని ఏజెంట్లు నోట్ చేసుకున్న తర్వాత ఈవీఎంల సీలు తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారు.
- వెంటనే అభ్యర్థుల వారీగా వారికి పోలైన ఓట్ల వివరాలు వెల్లడవుతాయి.
- ఈ విధంగా ఒక్క రౌండ్లో 14 ఈవీఎంల ఫలితాలు లెక్కిస్తారు.
- పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి రౌండ్ల సంఖ్య ఉంటుంది.
- ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్ వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు.
- లెక్కింపు ప్రక్రియ మొత్తం రాజకీయ పార్టీలు, ఏజెంట్ల సమక్షంలో జరుగుతుంది. వాళ్లు సంతృప్తి చెందిన తర్వాతే ప్రతి రౌండ్ ఫలితం వెల్లడిస్తారు.
- కౌంటింగ్ పూర్తయిన తర్వాత అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో డ్రాలో ఎంపిక చేసిన ఐదు వీవీ ప్యాట్‌లోని ప్రింటింగ్ ఓటర్ స్లిప్పులను లెక్కిస్తారు.



నల్లగొండ కౌంటింగ్ కేంద్రంలో చేసిన ఏర్పాట్లు

# నేడే కౌంటింగ్

## ఉదయం 8గంటల నుంచి ప్రారంభం

- 11గంటల వరకు ఫలితాల సరళి స్పష్టం
- మధ్యాహ్నం 2గంటల వరకు తుది ఫలితం
- ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల లెక్కింపు కేంద్రాలు
- నల్లగొండలో 6 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు
- సూర్యాపేటలో 4, భువనగిరిలో 2 స్థానాల కౌంటింగ్
- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- కౌంటింగ్ వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు
- ఎన్నికల కమిషన్ పాస్ ఉంటేనే కేంద్రాల్లోకి అనుమతికౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించాలి : కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్2 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ఫలితం నేడు తేలనుంది. నల్లగొండ జిల్లాలోని 6 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు కోసం జిల్లా కేంద్రంలో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. మిర్యాలగూడ రోడ్డులోని అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల్లో ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా నియోజకవర్గాల వారీగా వేర్వేరుగా నిర్వహిస్తారు. ప్రతి 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఒక రౌండ్ ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. 8 గంటలకు మొదలయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియ గరిష్టంగా మధ్యాహ్నం 2 గంటల వరకు పూర్తవుతుందని అంచనా. జిల్లాలో నల్లగొండతోపాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఆరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒక్క చోటనే జరుగనుంది. ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి మూడు దఫాలుగా శిక్షణ పూర్తి చేశారు. వీరికి ర్యాండం పద్ధతిలో శనివారం విధులను కేటాయించారు. వీరంతా ఉదయం 6 గంటల వరకే విధుల్లో ఉండాల్సిందిగా ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలోనే అల్పాహారం, భోజనం, టీ, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

### ఒక్కో రౌండ్‌లో 14 బూత్‌ల ఓట్ల లెక్కింపు

ఒక్కో నియోజకవర్గంలోని కౌంటింగ్ హాల్లో మొత్తం 14 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేస్తారు. అదనంగా పోస్టల్ బ్యాలెట్లకు, సర్వీస్ ఓట్ల లెక్కింపునకు టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. రిటర్నింగ్ అధికారికి మరో టేబుల్ ఉంటుంది. ఈ 14 టేబుళ్ల పై 14 బూత్‌ల ఈవీఎంలను ఉంచి ఒకే సారి ఓట్లు లెక్కిస్తారు. మొత్తం కలిపి ఒక రౌండ్ ఫలితంగా ప్రకటిస్తారు. ఆ విధంగా దేవరకొండలో 310 పోలింగ్ బూత్‌లు ఉండగా 23 రౌండ్లల్లో తుది ఫలితం వెల్లడి కానుంది. 299 పోలింగ్ కేంద్రాలున్న నాగార్జునసాగర్ నియోజకవర్గ తుది ఫలితం 22 రౌండ్లలో.. మిర్యాలగూడ (263 పోలింగ్ కేంద్రాలు) 19 రౌండ్లు, నల్లగొండ (284) 21 రౌండ్లలో తేలనుంది. మునుగోడులో 307 పోలింగ్ బూత్‌లు ఉండగా 22 రౌండ్లలో.. 305 పోలింగ్ కేంద్రాలు ఉన్న నకిరేకల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితం 22 రౌండ్లలో తేలనుంది. మొత్తం జిల్లాలోని 144 మంది అభ్యర్థుల భవితవ్యం మధ్యాహ్నం 2 గంటల వరకే దాదాపుగా వెల్లడయ్యే అవకాశం ఉంది. బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉన్న నియోజకవర్గాల ఫలితాలు కొంత తొందరగా పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### భారీ బందోబస్తు

ఓట్ల లెక్కింపును పకడ్బందీగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్స్ వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణలో కేంద్ర బలగాలు కాపలా కాస్తున్నాయి. దాంతో పాటు కౌంటింగ్ కేంద్రం వద్ద మూడెంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లోనూ ఆంక్షలు ఏర్పాటు చేశారు. పటాకులు కాల్చేందుకు అనుమతి లేదు. ఆదివారం సాయంత్రం వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ కొనసాగనుంది. కౌంటింగ్‌కు వచ్చే అభ్యర్థులు, వారి ఏజెంట్ల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలను సిద్ధం చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్ ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిసేందుకు అభ్యర్థులు, వారి ఏజెంట్లు సహకరించాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు.




**ఉమ్మడి జిల్లాలో కౌంటింగ్ స్వరూపం**

| నియోజకవర్గం | పోలింగ్ బూత్‌లు | రౌండ్ల సంఖ్య |
|---|---|---|
| దేవరకొండ | 310 | 23 |
| నాగార్జునసాగర్ | 299 | 22 |
| మిర్యాలగూడ | 263 | 19 |
| నల్లగొండ | 284 | 21 |
| మునుగోడు | 307 | 22 |
| నకిరేకల్ | 305 | 22 |
| సూర్యాపేట | 271 | 20 |
| తుంగతుర్తి | 326 | 19 |
| కోదాడ | 296 | 18 |
| హుజూర్‌నగర్ | 308 | 17 |
| భువనగిరి | 257 | 19 |
| ఆలేరు | 309 | 23 |

**నల్లగొండ జిల్లాలోని 2023 ఎన్నికల్లో పోలింగ్ వివరాలు**

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| దేవరకొండ | 2,51,622 | 2,12,593 | 84.49 |
| నాగార్జునసాగర్ | 2,33,412 | 2,00,235 | 85.79 |
| మిర్యాలగూడ | 2,31,391 | 1,93,185 | 83.49 |
| నల్లగొండ | 2,44,460 | 1,99,479 | 81.60 |
| మునుగోడు | 2,52,648 | 2,32,158 | 91.89 |
| నకిరేకల్ | 2,50,547 | 2,17,149 | 86.71 |
| మొత్తం | 14,64,080 | 12,54,799 | 85.71 |

# సూర్యాపేటలో 64 టేబుళ్లు

## పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 18 టేబుళ్లు

సూర్యాపేట, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తి కాగా.. నేడు జరిగే ఓట్ల లెక్కింపుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్లను సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో లెక్కించనున్నారు. నాలుగు నియోజకవర్గాలకు 64 టేబుళ్లు ఏర్పాటు చేశారు. గతంలో ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లను మాత్రమే ఏర్పాటు చేయగా.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఫలితాలు ఒకే సారి పూర్తయ్యేలా అవసరమైతే అదనపు టేబుళ్లను ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. దాంతో నాలుగు నియోజకవర్గాలకు కలిపి 2018లో 56 టేబుళ్లను ఏర్పాటు చేయగా ఈ సారి మరో 8 అదనంగా ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 1201 పోలింగ్ బూత్‌లు ఉండగా సూర్యాపేటలో 271 పోలింగ్ బూత్‌లల కౌంటింగ్ కోసం 14 టేబుళ్లు, తుంగతుర్తిలో 326 పోలింగ్ బూత్‌లకు 18, కోదాడ 296 పోలింగ్ కేంద్రాలకు 16, హుజూర్‌నగర్‌లో 308 కేంద్రాలకు 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు ఈ సారి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల కౌంటింగ్ ఒకేసారి ప్రారంభించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం ఓటర్ల సంఖ్యను బట్టి టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సూర్యాపేటలో 6, కోదాడలో 5, తుంగతుర్తిలో 3 టేబుళ్లను ఏర్పాటు చేయగా హుజూర్‌నగర్ కోసం 4 మొత్తం 18 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లతో పాటు ఆయా పార్టీల ఏజెంట్లతో పాటు సర్వీస్ అందించేందుకు 50 మంది రెవెన్యూ సిబ్బంది ఉంటారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కౌంటింగ్ కేంద్రం చుట్టూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం మొత్తాన్ని అనువనువూ క్షుణంగా పరిశీలించేందుకు కౌంటింగ్ కేంద్రంలో, బయట అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.




సూర్యాపేట కౌంటింగ్ హాల్లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం చేసిన ఏర్పాట్లు

# ర్యాలీలకు అనుమతిలేదు : కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 6 గంటలకు ప్రారంభం కానుందని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్. వెంకట్రావ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి మాట్లాడారు. జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకున్న 112 మంది సైనికుల ఓట్ల లెక్కింపు మొదట ఉంటుందని, తర్వాత పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలను లెక్కిస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజవర్గాలకు 56 టెబుళ్లు, ఎన్నికల సంఘం సూచనల మేరకు మరో 10 టేబుళ్లను అదనంగా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీల ఏజెంట్లు ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని ర్యాలీలు, సభలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. స్థానిక ఆర్వో, డీఎస్పీ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని వారు జిల్లా కలెక్టర్ అనుమతితో ప్రత్యేక పరిస్థితులు ఉంటేనే అనుమతిస్తారని చెప్పారు.

### మూడంచెల భద్రత : ఎస్పీ

కౌటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. కేంద్ర బలగాల సహకరంతోపాటు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఎన్నికల సందర్భంగా 55 క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. నాగారం మండలంలో జరిగిన ఘర్షణలో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎఫ్ఓ సతీశ్, డీపీఆర్ఓ రమేశ్, ఏఈఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

### తొలి ఫలితం 9 గంటల లోపే..

ఆదివారం ఉదయం 7.30 గంటలకు ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి, అభ్యర్థులు లేదా వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్స్‌ను ఓపెన్ చేస్తారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ హాల్లో తీసుకువస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు టేబుళ్లపై ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలుపెట్టాక ఆ వెంటే ఐదు, పది నిమిషాల తేడాతోనే తొలిరౌండ్ ఈవీఎంల లెక్కింపును కూడా ప్రారంభిస్తారు. దాంతో తొలి ఫలితం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య రావచ్చని అంచనా. తర్వాత ప్రతి 20 నిమిషాల నుంచి 30 నిమిషాల్లో ఒక రౌండ్ లెక్కింపు పూర్తి కానుందని తెలుస్తోంది. ఒక్కో రౌండ్‌లో ఒక్కో నియోజకవర్గానికి చెందిన 10 వేల నుంచి 12 వేల వరకు ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. అయితే కంట్రోల్ యూనిట్‌లో బటన్ నొక్కితే ఎవరికి ఎన్ని ఓట్లు అనేది నిమిషాల్లోనే స్పష్టమైనా.. అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను నోట్ చేయడానికి ఎక్కువ సమయం తీసుకోనుంది. మొత్తం అభ్యర్థుల ఓట్లతో పాటు నోటాకు వచ్చిన ఓట్లను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఫలితం స్పష్టమైనా... ఆర్‌ఓ సంతకంతో పాటు ఎన్నికల పరిశీలకుని ఆమోదం కూడా లభిస్తేనే అది అధికారికంగా బయటకు వెల్లడిస్తారు. ఇదంతా జరుగాలంటే కనీసం 30 నిమిషాలు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈవీఎంల లెక్కింపు పూర్తయ్యాక చివరలో వీవీప్యాట్ స్లిప్స్‌ను కూడా లెక్కించాల్సి ఉంటుంది. మొత్తం ఈవీఎంల నంబర్లతో డ్రా వేసి అందులోంచి ఏవేనీ ఐదు ఈవీఎంల వీవీప్యాట్ స్లిప్స్‌ను ఎంపిక చేస్తారు. వీటిని కౌంట్ చేశాక... సంబంధిత ఈవీఎంలో వచ్చిన ఓట్ల లెక్కింపుతో సరిసమానం అయ్యాయా లేదా అని చూస్తారు. ఇదంతా పూర్తయ్యాకే అధికారికంగా విజేతను ప్రకటించనున్నారు.




సూర్యాపేటలో కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు